ప్రజాశక్తి

సోమవారం 20 మార్చి 2023 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మహిళా రైతు ఆత్మహత్య

అప్పుల బాధే కారణమంటున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-పర్చూరు

ఉరేసుకొని మహిళా రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పర్చూరు మండలం, ఏదుబాడులో ఆదివారం జరిగింది. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్చూరు మండలం, ఏదుబాడుకు గ్రామానికి చెందిన నిజాంపట్నం శ్రీనివాస రావు, అరుణ(46) దంపతులు వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్నారు. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో మిర్చి, రెండు ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. పంట చేతికివచ్చే సమయంలో అకాల వర్షాలకు పంటలు దెబ్బ తిన్నాయి. చేసిన అప్పులు ఎలా తీర్చాలనే బాధతో ఆదివారం ఉదయం అరుణ బాత్‌రూంలోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. అరుణకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అరుణ సోదరుడి ఫిర్యాదు మేరకు పర్చూరు ఎస్సై సి.హెచ్.చెంచుప్రసాద్ కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చెంచుప్రసాద్

మాట్లాడుతున్న రాష్ట్ర హోం మంత్రి వనిత

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

రాష్ట్ర హోం మంత్రి వనిత

2లో

మళ్లీ అదే నిర్బంధం

- అంగన్‌వాడీలకు బెదిరింపులు
- సిఐటియు నేతలకు నోటీసులు
- తెలుగుదేశం నేతలకు కూడా..

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో కన్నెర్ర జేసినా ప్రభుత్వం తీరు మారలేదు. ప్రజావ్యతిరేకతను తగ్గించుకునే యోచనలో ఉన్నట్లు కనిపించడం లేదు. ఈ నెల 20న అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడకు పిలుపునిచ్చారు. ఇంకేముందీ ప్రభుత్వం వెంటనే పోలీసులను రంగంలోకి దింపింది. ఎవరినీ కదలనివ్వద్దంటూ ఆదేశాలు జారీచేశారు. అంగన్‌వాడీలకు బెదిరింపులు తీవ్రమయ్యాయి. గ్రామాల్లో వైసిపి నేతల నుంచి వారిపై అన్ని రకాలుగా బెదిరింపులకు దిగుతున్నారు. కదిలితే ఉద్యోగాలు పీకేస్తామంటూ హెచ్చరికలు చేస్తున్నారు. పొదిలిలో పోలీసుస్టేషన్‌కు అంగన్‌వాడీలను చంటిబిడ్డలతో ఉన్నవారిని కూడా పిలిపించి నోటీసులు ఇచ్చారంటే ఎంత దారుణంగా ఉన్నారో చెప్పాల్సిన అవసరం లేదు.

అటు వైసిపి నేతలే కాకుండా ఇటు పోలీసులు కూడా ఒత్తిడి చేస్తున్నారు. చలో విజయవాడకు అనుమతి లేదని, వెళితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా సాగే ఆందోళనలను కూడా ఇలా అడ్డుకుంటున్నారు. ఇప్పటికే ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్న ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికలను చూసైనా మార్పు దిశగా సాగుతుందని భావించారు. కానీ మళ్లీ అదే నిర్బంధాలు కొనసాగిస్తోంది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు కూడా వారం రోజుల నుంచి నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్నారు. విధులకూ నల్లబ్యాడ్జీలతోనే హాజరవుతున్నారు. వారి సమస్యలపై ఏమాత్రం పట్టించుకునే పరిస్థితి లేదు. అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్లతోనే ఎప్పటినుంచో ఆందోళన చేస్తున్నారు. వేతనం రూ.26 వేలకు పెంచాలని, తెలంగాణా కన్నా రూ.1000 అదనంగా ఇస్తామన్న సిఎం హామీ అమలు చేయాలని, ఫేస్ యాప్ ఆపాలని, వేసవిలో ఒంటిపూట బడులు పెట్టాలని కోరుతున్నారు. అంగన్‌వాడీ స్కూళ్లకు నాణ్యమైన సరుకులు ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ సెలవులు ఇవ్వాలని, రిటైర్‌మెంటు బెనిఫిట్స్ ఇవ్వాలని కోరుతున్నారు. 300 జనాభా దాటిని మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా డిమాండు చేస్తున్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని ఎప్పటినుంచో వేడుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు చెప్పే అనేక పనులు చేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనేదీ న్యాయమైన డిమాండ్. వీటిని తీర్చలేని ప్రభుత్వం వీరు ఆందోళనలకు పిలుపునిస్తే భయపడుతోంది. వారిని అణచివేసేందుకు సిద్ధమవుతోంది. అందుకే 2లో

విజయవాడలో ధర్నాకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని.. పొదిలిలో చంటి పిల్లలతో సహా పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అంగన్‌వాడీలకు, నేతలకు నోటీసులు జారీ చేస్తున్న పోలీసులు

పాలకపక్షంలో అంతర్మథనం

- పట్టభద్రుల తీర్పుపై పార్టీలో తీవ్ర చర్చ
- ఓటమిపై పోస్టుమార్టం చేసుకుంటామన్న బాలినేని

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పాలకపక్షంలో రెండు రోజులుగా తీవ్ర అంతర్మథనం జరుగుతోంది. పట్టభద్రుల తీర్పుపైనే ఆ పార్టీ నేతల్లో తీవ్ర చర్చ సాగుతోంది. విద్యావంతుల్లో ప్రభుత్వ పనితీరు బాగాలేదని అంగీకరించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. పైకి చెప్పకపోయినా అంతర్గతంగా ఆ పార్టీ నేతల్లో మాత్రం ప్రభుత్వంపై వ్యతిరేకత ఎలా ఉందో గుర్తిస్తున్నారు. భవిష్యత్‌పైనా ఆందోళన చెందుతున్నారు. మూడు ప్రాంతాల్లోనూ ఫలితాలు ప్రతికూలంగా రావడమే చర్చకు కారణమైంది.

నాలుగేళ్లలో జరిగిన అన్ని ఎన్నికల్లో క్లీన్‌స్వీప్ చేస్తే ఇప్పుడు మనమే క్లీన్‌స్వీప్ అయ్యామనే చర్చ వైసిపి నేతల మధ్య సాగుతోంది. కారణాలపై పలు ఊహాగానాలు.. అంచనాలు.. విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు రెండు గెలిచినా ఎలా గెలిచారో వారికే తెలుసు. దీంతో వాటి ప్రభావం పెద్దగా లేదు. ప్రైవేటు ఉపాధ్యాయులను అర్హత లేకున్నా ఓటర్లుగా చేర్చారు. ఓటుకు రూ.5 వేలు ఇచ్చి అన్ని రకాలుగా ప్రలోభాలు పెట్టి ఓట్లేయించుకున్నారు. ఇప్పుడు ఆ గెలుపు పార్టీ పరువు కాపాడలేక పోయింది. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా ప్రాంత జిల్లాలతో కూడిన ఈ మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసిపికి ఎదురుగాలి వీచింది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలినా వైసిపి అభ్యర్థులు గట్టెక్కలేదు. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. అధికారం కలిసి రాలేదు. యంత్రాంగం సహకరించిందా? అనే చర్చకు వస్తే దొంగోట్లు చేర్చడంలో కొందరు అధికారుల పాత్ర విమర్శలకు తావిచ్చింది. అయితే ఓటింగు సరళిలో తీవ్రమైన మార్పు కనిపించింది. తెలుగు దేశం వైపు గ్రాడ్యుయేట్లు చూశారు. రాజకీయంగా రెండు పార్టీలు అభ్యర్థులను దింపాయి. ఎటువంటి రాజకీయ అండ లేకున్నా పిడిఎఫ్ అభ్యర్థులకు గణనీయంగా ఓట్లు పడ్డాయి. తటస్థులు, ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, నిరుద్యోగులు వీరికి ఓటేశారు. ప్రైవేటు టీచర్లతోనే వైసిపి ఎమ్మెల్సీని గెలుచుకుంది. దీంతో గెలిచామన్న సంతృప్తి కూడా లేకుండా పోయింది. ఇక భవిష్యత్ 2లో

ఓటమిపై పోస్టుమార్టం చేసుకుంటాం

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

నాలుగేళ్లలో అన్ని ఎన్నికలను క్లీన్‌స్వీప్ చేశాం. ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటమికి కారణాలపై పోస్టుమార్టం చేసుకుంటామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. రెండు టీచర్ ఎమ్మెల్సీలను గెలుచుకున్నాం కదా అని అన్నారు. చదువుకున్న వారు, ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉన్న మాట వాస్తవమేనన్నారు. వాటిని రానున్న ఏడాది కాలంలో సర్దుబాటు చేసుకుంటామన్నారు. సంక్షేమ పథకాలు అందే వారిలో గ్రాడ్యుయేట్లు లేరన్నారు. వ్యతిరేకతకు ఇది కూడా కారణంగా చెప్పారు. ఏదేమైనా ఓటమికి కారణాలపై పోస్టుమార్టం చేసుకుంటామన్నారు.

మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

మల్లు స్వరాజ్యం

ఆశయాలను కొనసాగిద్దాం

- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపు
- స్వరాజ్యంకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ఆదివారం తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆంధ్ర ప్రదేశ్‌లో మహిళా ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభ జరిగింది. కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డి.హనీఫ్ అధ్యక్షత వహించారు. తొలుత మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు జాలా అంజయ్య పూలమాల వేసి.. నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం సాగిన సాయుధ తెలంగాణ పోరాటంలో చిన్న వయసులోనే స్వరాజ్యం ఆ పోరాటంలో దూకిందని, అందుకు వాళ్ల కుటుంబసభ్యుల ప్రభావం ఆమెపై ఉందన్నారు. వాళ్ల కుటుంబసభ్యులు స్వాతంత్ర పోరాటంలో ఉన్నారని, అందుకే ఆమె పేరును స్వరాజ్యం అని పెట్టుకున్నారన్నారు. ఆ వయసులోనే వాళ్ళ ఇంటిలోనే జరుగుతున్న వివక్ష, అసమానత, వేతనంలో దోపిడీ వంటి వాటిపై ఆమె తిరుగుబాటు చేసిందన్నారు. గ్రామీణ ప్రజలు, మహిళలను సమీకరించి ఆమె ఉద్యమాలకు సిద్ధం చేసిందని, అన్న భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి, ఆమె భర్త మల్లు వెంకట నరసింహారెడ్డి స్ఫూర్తితో మహిళా ఉద్యమ నిర్మాణంలో కూడా కీలక పాత్ర 2లో

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యార్థి దశ నుంచే విలువలకు కట్టుబడి ఉండాలని.. చదువులో రాణిస్తూ ఉన్నతంగా ఎదగాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత విద్యార్థులకు సూచించారు. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాల 26వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధ్యక్షత వహించారు. సభలో వనిత మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువుల కోసం దివంగత నేత డాక్టర్ వైఎస్ఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారన్నారు. దాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిగ్విజయంగా కొనసాగిస్తున్నారన్నారు. లక్షలాది కోట్లు చదువుల కోసం ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్య కోసం ఖర్చు చేసిన నిధులు వృథా కారాదన్నారు. విద్యార్థులు బాధ్యతగా చదువుకోవాలన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయరాదన్నారు. ఇటీవల యువత డ్రగ్స్‌కు దగ్గరవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చెడుకు దూరంగా ఉంటేనే జీవితం బాగుంటుఉందన్నారు. మనం బాగుంటే సమాజం బాగుంటుందన్నారు. మారు ప్రాంతంలో డాక్టర్ శామ్యూల్ జార్జి, చెరుకూరి థెరిసమ్మ 26 సంవత్సరాల క్రితం ఇంజినీరింగ్ కళాశాలను జిల్లాలో మొదటి సారిగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ సభలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్, డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న హోం మంత్రి తానేటి వనిత

పాలకపక్షంలో అంతర్మథనం

(మొదటిపేజీ తరువాయి)

ఎలా ఉంటుందోన్న చర్చ పార్టీ కార్యకర్తల్లో మొదలైంది. మళ్లీ అధికారానికి ఢోకా లేదని నిన్నటి వరకూ వైసిపి నేతలు బాహాటకంగా చెప్పుకున్నారు. ఇప్పుడా పరిస్థితి ఉందా? అంటే గట్టిగా చెబుతారా? లేదా? అనేదీ చూడాలి. ప్రభుత్వంపై చదువుకున్నోళ్లలో వ్యతిరేకత తీవ్రంగా ఉందని తేలింది. వాస్తవానికి నిరుద్యోగ సైన్యం పెరుగుతోంది. పరిశ్రమలు లేవు. ఉపాధి లేదు. ఇవన్నీ నెగిటివ్ ఓటుకు కారణంగా కనిపిస్తోంది. ఉద్యోగుల్లోనూ వ్యతిరేకత ఉంది. ఉద్యోగులు కూడా వైసిపికి వ్యతిరేకంగా ఓటేశారని పాలకపక్షం గుర్తించింది. అయితే ఓటమిని అంగీకరించని కొందరు పాలకపక్ష పెద్దలు సంక్షేమ పథకాలు వీరికి లేవని, అవి అందనివాళ్లే వీరని చెబుతోంది. అందుకే అసంతృప్తితో ఓటేశారని విశ్లేషణలు చేస్తున్నారు. సంక్షేమ పథకాలు తీసుకున్న వాళ్లే రేపు తమకు ఓటేస్తారనే ధీమాలో ఉన్నారు. వాస్తవానికి ఈ రోజు ప్రతి పేద కుటుంబం నుంచి గ్రాడ్యుయేట్లు ఉన్నారు. ఈ కుటుంబాల్లో పథకాలు వచ్చాయి. లబ్ధి కూడా పొందినా.. ఆ కుటుంబాల ఎదుగుదలలో పెద్ద ప్రభావం చూపలేదని గుర్తించాలి.

ఓటమిపై పోస్టుమార్టం చేసుకుంటాం

ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

నాలుగేళ్లలో అన్ని ఎన్నికలను క్లీన్‌స్వీప్ చేశాం. ఇప్పుడు గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటమికి కారణాలపై పోస్టుమార్టం చేసుకుంటామని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. రెండు టీచర్ ఎమ్మెల్సీలను గెలుచుకున్నాం కదా అని అన్నారు. చదువుకున్న వారు, ఉద్యోగుల్లో వ్యతిరేకత ఉన్న మాట వాస్తవమేనన్నారు. వాటిని రానున్న ఏడాది కాలంలో సర్దుబాటు చేసుకుంటామన్నారు. సంక్షేమ పథకాలు అందే వారిలో గ్రాడ్యుయేట్లు లేరన్నారు. వ్యతిరేకతకు ఇది కూడా కారణంగా చెప్పారు. ఏదేమైనా ఓటమికి కారణాలపై పోస్టుమార్టం చేసుకుంటామన్నారు.

మల్లు స్వరాజ్యం

ఆశయాలను కొనసాగిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

పోషించిందన్నారు. ప్రకాశం జిల్లాకు ఆమెకు ఉన్న అనుబంధం గురించి 1978 ప్రాంతంలో జిల్లా ఐఎల్‌టిడి కార్మికుల యూనియన్ ఎన్నికల సందర్భంగా శాసన సభ్యురాలిగా ఉండి ఆమె వచ్చి ఇక్కడ ప్రజలను సమీకరించే ప్రయత్నం చేసిందన్నారు. ఆ తరువాత జరిగిన మహిళా సంఘం మహాసభల్లో ప్రధాన వక్తగా వచ్చి పాల్గొన్నారన్నారు. ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో జరిగిన సారా వ్యతిరేక పోరాటంలో కూడా ఆమె ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఇటువంటి ఉద్యమాలు నిర్వహించడమే కాకుండా సమాజంలో ఉన్న అసమానతలు పోవాలని, స్త్రీలకు సమానత్వం కావాలని దున్నేవాడికే భూమి దక్కాలని సాగిన ఉద్యమాలకు ఆమె నాయకత్వం వహించారన్నారు. ఒక మహిళగా ఆయుధాల శిక్షణ పొంది గుర్రం స్వారీ నేర్చుకుని నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా ఆనాడు పోరాడిందన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా సమాజంలో ఉన్న సనాతన సాంప్రదాయాలు పోవాలని జరిగిన పోరాటాలు స్ఫూర్తిదాయకం ఆమె ఆశయాలు సాధించేందుకు మనందరం అంకితభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, జివి. కొండారెడ్డి, కంకణాల ఆంజనేయులు, పార్టీ సీనియర్ నాయకులు వై.సిద్ధయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండెపోటుతో విశ్రాంత విఆర్ఓ మృతి

ప్రజాశక్తి -సంతనూతలపాడు రూరల్

మండల పరిధిలోని మైనంపాడు గ్రామానికి చెందిన విశ్రాంత విఆర్ఓ చదలవాడ సీతారామయ్య(64) గుండెపోటుతో ఆదివారం మతి చెందారు. ఆయన మతదేహాన్ని పలువురు సందర్శించి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, మైనంపాడు గ్రామ టిడిపి అధ్యక్షుడు ఆళ్ళ ఆంజనేయులు, పెరుగు రాము, ఎస్‌కె. కరిముల్లా, విశ్రాంత విఆర్ఓ నరసింహారావు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి-పొదిలి

వాహన చోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. స్థానిక పెద్ద బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనానికి సంబంధించిన ధ్రు వపత్రాలు లేని వారు, హెల్మెట్లు ధరించని వాహన చోదకులను గుర్తించి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తు ప్రమాదాల బారిన పడుతూ మృతి చెందుతున్న విషయం గుర్తించాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ట్రాపిక్ నిబంధనలపై ఆవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహన చోదకులు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చైర్మన్ షకూర్‌కు మాతృవియోగం

ప్రజాశక్తి-పొదిలి

పొదిలికి చెందిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ ముల్లా షకూర్‌కు మాతృవియోగం కలిగింది. ఆయన మాతృమూర్తి మెహరున్నీషా ఆదివారం మృతిచెందారు. మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ కందుల నారాయణరెడ్డి, కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాస రెడ్డి తదితరులు మోహరున్నీషా భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పలువురు టిడిపి, వైసిపి నాయకులు ఉన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల

అకాల వర్షంతో పంటలకు నష్టం

ప్రజాశక్తి-పామూరు

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షానికి చేతికొచ్చిన పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు. అకాల వర్షం కారణంగా చిలంకూరులో జొన్న పంట నేలకు ఒరిగి కంకులలో మొలకలు వస్తున్నట్లు తెలిపారు. వగ్గంపల్లి ఏరియాలో వరి ఓదెలు వర్షానికి తడిసినట్లు తెలిపారు. గోపాలపురం, మోట్రోలుపాడు గ్రామాలలో ఇటుక బట్టీలలో నీరు నిలచి ఇటుకలు తడిసి పోయినట్లు బాధితులు తెలిపారు. అకాల వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతులు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఎం నాయకుడు కె. మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వీరనారాయణ కోరారు.

కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పొగాకు, గుట్కాలను వినియోగించడం వల్ల కేన్సర్ వస్తుందని, ప్రతి ఒక్కరూ వీటికి దూరంగా ఉండాలనిప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు డాక్టర్ కళా సంధ్య తెలిపారు. ఆటో డ్రైవర్లు, భవన కార్మికులకు కేన్సర్ వ్యాధి నివారణపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని, కేన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేన్సర్ వ్యాధి నివారణపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నయాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు

మళ్లీ అదే నిర్బంధం

(మొదటిపేజీ తరువాయి)

కదలకుండా అష్టదిగ్బంధనం చేయాలని నిర్ణయించింది. చలో విజయవాడకు వెళ్లకుండా కట్టడి చేస్తున్నారు. వారికి అండగా ఉండే సంఘాలపైనా నిర్బంధం ప్రయోగిస్తున్నారు. మద్దతు పలికే పార్టీలకు నోటీసులు ఇస్తున్నారు. సిఐటియు నేతలందరికీ జిల్లా వ్యాప్తంగా నోటీసులు ఇచ్చారు. విజయవాడకు వెళ్లవద్దంటూ స్టేషన్లకు పిలిచి చెబుతున్నారు. ఇళ్లకు వెళ్లి జనంలోనే నోటీసులు ఇస్తున్నారు.

టిడిపి నేతలకు కూడా..

చలో అసెంబ్లీకి వెళ్లవద్దంటూ తెలుగుదేశం పార్లమెంటు అధ్యక్షుడు నూకసాని బాలాజీకి పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆ పార్టీ నేతలకూ కొన్నిచోట్ల నోటీసులు జారీ చేశారు. కదిలితే కేసులు పెడతామంటూ పోలీసులు ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీటికి ఎవరూ భయపడే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో ఉద్యోగులు విజయవాడలో చేసిన ర్యాలీ ఇప్పటికీ ప్రభుత్వానికి వణుకు పుట్టిస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది.

విజయవాడ వెళ్లొద్దని ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

చలో అస్లెంబీ నేపథ్యంలో టిడిపి మండల నాయకులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, గాయం రామిరెడ్డి, రెడ్డం తిరుపతిరెడ్డి తదితరులు పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిర్బంధాలతో ఉద్యమాలను అణచి వేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకమని తెలిపారు. అంగన్‌వాడీ న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. **యర్రగొండపాలెం :** వామపక్షాలు, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనరాదని తెలుపుతూ తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు షేక్ అజారుద్దీన్‌కు స్థానిక ఎస్ఐ జి కోటయ్య సెక్షన్ 149 నోటీసు ఆదివారం జారీ చేశారు. **మార్కాపురం :** వామపక్షాలు, టిడిపి ఆధ్వర్యంలో సోమవారం చలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా సిపిఎం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డికి మార్కాపురం పోలీసులు నోటీసులు జారీ చేశారు. **నాగులుప్పలపాడు :** చలో అస్లెంబీ నేపథ్యంలో టిడిపి నాయకులకు పోలీసులు ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికులు ఎదుంర్కొంటున్న న్యాయ పరమైన సమస్యలను పరిష్కరించాలని కోరడం నేరమైనట్లు ప్రభుత్వం నిరంకుశంగా పోలీసుల చేత నోటీసులు ఇప్పించడం అన్యాయమని తెలిపారు.

హనుమంతునిపాడులో నోటీసు అందజేస్తున్న పోలీసులు

మార్కాపురంలో నోటీసు అందజేస్తున్న పోలీసులు

ఆ షెడ్డు.. అసాంఘికాలకు నిలయం

ప్రజాశక్తి-పంగులూరు

జాతీయ రహదారిపై కొంతమంజులూరు సమీపంలో, మంచి విస్తీర్ణంలో ఉన్న ఓ షెడ్డు అసాంఘికాలకు నిలయంగా మారింది. ఈ షెడ్డు జాతీయ రహదారికి అందుబాటులో ఉండటం, గ్రామంలో నుంచి వచ్చే రోడ్డు పక్కనే ఉండటం, గ్రామానికి దూరంగా ఉండటం వంటి కారణాలతో తాగుబోతులకు, వ్యభిచారులకు, జూదగాళ్లకు నిలయంగా మారింది. కొండమంజులూరు గ్రామంలోని దళితులకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన భూమిలో ఈ షెడ్డు ఉంది. ఇది అసైన్మెంట్ భూమి. ఈ భూమిని ఎవరో కొనుగోలు చేసి, అక్కడ హెూటల్ పెట్టాలని పెద్ద షెడ్డు నిర్మించాడు. అయితే హెూటల్ పెట్టకుండా ఖాళీగా ఉంచడంతో, ఈ షెడ్డు అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇక్కడ అనేకమంది జూదరులు వచ్చి పేకాట ఆడటం, మద్యం సేవించడమే గాక వేశ్యలను కూడా తీసుకువస్తున్నారు. దీంతో ఈ షెడ్డులో మొత్తం మద్యం సీసాలు, గ్లాసులు, వాటర్ బాటిల్స్‌తో నిండిపోయింది. మందుబాబులు ఇక్కడకు మద్యం తీసుకుని వచ్చి తాగి, ఇక్కడే పొర్లాడి వెళుతుంటారు. పక్కనే ఉన్న జాతీయ రహదారిపై నిరంతరం రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులు తిరుగుతూనే ఉంటారు. పోలీస్ అధికారులు కూడా నిరంతరం ఈ రహదారిపై ప్రయాణం చేస్తూనే ఉంటారు. అనేకమంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు కూడా తిరుగుతూనే ఉంటారు. అయినా కూడా భయం లేకుండా ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు నిరాఘాటంగా సాగుతున్నాయి. ఇప్పటికైనా ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, మద్యం సేవించకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అసాంఘికాలకు నిలయంగా మారిన షెడ్డు లోపలి భాగం

విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న దృశ్యం

విద్యార్థులకు అల్పాహారం పంపిణీ

ప్రజాశక్తి అద్దంకి

విద్యార్థులు చక్కటి విద్యను కొనసాగించాలంటే మంచి పౌష్టికాహారం ఎంతైనా అవసరమని, దీనిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కెవి శ్రీనివాసరావు దాతల సహకారంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు దాదాపు 200 మందికి అందించే కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. ఈ ఉన్నత పాఠశాలకు దాదాపు మండల ఇతర మండలాల పరిధిలో దాదాపు 22 గ్రామాల విద్యార్థులకు, ముండ్లమూరు, పంగులూరు గ్రామాల పరిధిలో కొంతమంది విద్యార్థులు విద్యనభ్యసించేందుకు చేరుకుంటారు. రానున్న పదో తరగతి పరీక్షల కోసం పాఠశాలలో స్టడీ అవర్స్ జరుగుతున్న క్రమంలో వారు సాయంత్రం అల్పాహారం కోసం గ్రామంలోని చిన్నపాటి హెూటల్స్‌కు రావలసిన దుస్థితి ఏర్పడడంతో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు దాతల సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. ప్రతిభా విద్యా సంస్థల అధినేత నల్లూరి వెంకటేశ్వరరావు 10 రోజులకు, చెన్నుపల్లి వాసు మరో మూడు రోజులకు విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ మంచి పనికి దాతలు ఎవరైనా ముందుకు రావాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కోరిక మేరకు గ్రామానికి చెందిన ఘంటసాల ప్రసన్న తమ తల్లిదండ్రుల సహకారంతో విద్యార్థులకు అల్పాహారం అతి తక్కువ ధరకే ముందుకు వచ్చారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన

ఆశా వర్కర్ కుటుంబానికి సాయమందించాలి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మృతిచెందిన ఆశా వర్కర్ గుంటూరు లక్ష్మి (ఫైల్)

గత శనివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆశా వర్కర్ గుంటూరు లక్ష్మికి రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన మరొక ఆశావర్కర్ పత్తిపాటి శాంతికి రూ.లక్ష ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏల్చూరు గ్రామానికి చెందిన వీరు సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలుగా పనిచేస్తూ, విధి నిర్వహణలో భాగంగా ప్రమాదానికి గురయ్యారన్నారు. పేద కుటుంబానికి జీవనాధారమైన గుంటూరు లక్ష్మి మృతి చెందటం, పత్తిపాటి శాంతి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందటం బాధాకరమన్నారు. ఆదివారం ఏల్చూరులో బాధిత కుటుంబాలను నాయకులు కలుసుకొని తమ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

టిడిపి జెండా ఎగరేస్తాం: నారపశెట్టి

ప్రజాశక్తి-దర్శి

కేక్ కట్ చేస్తున్న నాయకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగరవేయడం వచ్చే అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు నాంది అని మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, టిడిపి పరిశీలకులు నల్లపాటి రామచంద్రప్రసాద్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు టిడిపి కైవసం చేసుకోవడాన్ని హర్షిస్తూ స్థానిక కార్యాలయంలో ఆదివారం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, శివ కోటేశ్వరరావు, నెమిలయ్య, కూరపాటి శ్రీను, ఓబులరెడ్డి, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు దారం సుబ్బారావు, శ్రీనివాసరావు, మధు, సందు రామయ్య, పౌలు, గోవిందరెడ్డి, బాలకృష్ణ, వీరనాగిరెడ్డి, వలి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కృష్ణ చైతన్య

దేవస్థానంలో కృష్ణచైతన్య

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

మండలంలోని వైదన గ్రామంలో ఆదివారం పోలేరమ్మ దేవస్థానంలో జరిగిన వైసిపి నాయకుడు గాలం నిమ్మయ్య కుమార్తె దీపిక పుట్టు వెంట్రుకల వేడుకకు శాప్ నెట్ చైర్మన్ అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇనఛార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరై చిన్నారి దీపికను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మండల ప్రజానీకం పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో విలసిల్లాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా అంతర్గత రోడ్లు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సచివాలయాల ద్వారా స్వచ్ఛమైన పాలన అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. అయితే సచివాలయాలు సంక్షేమ పథకాలకు మాత్రమే పరిమితమయ్యాయి. గ్రామ సమస్యలు గ్రామ అవసరాలు గ్రామ అభివృద్ధి చేయడంలో సచివాలయ వ్యవస్థ పూర్తిగా విఫలమైంది అందుకు నిదర్శనంగా త్రిపురాంతకం మండలంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం ఒకటి కూడా నిర్మించకపోవడం ఎందుకు నిదర్శనం నాలుగు సంవత్సరాలు సచివాల వ్యవస్థ ఏర్పడి మూడు సంవత్సరాలు గడుస్తున్న 25 పంచాయతీల్లో అంతరగడ్డలు రోడ్డు నిర్మాణం, సిమెంట్ రోడ్డు నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థ పారిశుధ్య పనులు లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రిపురాంతకం నుంచి వరకు గల ఆర్అండ్‌బి రహదారి గుంతలమయంగా మరి ప్రజలు అనేక ఇబ్బందులుగా గురవుతున్న అనేక రిపేర్లకు గురవుతున్నాయని పది నిమిషాల ప్రయాణం గంటకు పైగా ఆహ్వానించవలసి వస్తుందని మహిళల ముఖ్యంగా పాలక ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. నాయకులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

గుంతలతో అధ్వానంగా ఉన్న రోడ్డు

స్వాధీనం చేసుకున్న మద్యంతో పోలీసులు

అక్రమంగా మద్యం కలిగిన వ్యక్తులు అరెస్ట్

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తులను బాపట్ల సెబ్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. బాపట్ల సెబ్ సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల నియోజకవర్గంలోని పివి పాలెం మండలం మంతెనవారిపాలెం గ్రామంలో నాన్-డ్యూటీ పైడ్ లిక్కర్ కలిగి ఉన్న ఒక నిందితుడిని అరెస్ట్ చేయగా మరో వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. ఆదివారం బాపట్ల సెబ్ కార్యాలయం ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పివిపాలెం గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు, రాంభొట్లవారి పాలెం గ్రామానికి చెందిన జూపూడి బేబీశ్వరరావు నిందితులుగా ఉన్నారు. ఈ కేసులో 60 750 ఎమ్ఎల్ మెన్షన్ హౌస్ ఫ్రెంచ్ బ్రాందీ, ఒక లీటర్ పరిమాణం గల 10 మొత్తం 71 బాటిళ్ల నాన్ డ్యూటీ మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే మారుతి సుజుకి కారు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి పరారీలో ఉన్న వ్యక్తిని పట్టుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

నీళ్ల కోసం వచ్చి..

మృత్యువాత పడిన జింక

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

వేసవి వచ్చింది. అడవిలో జంతువులకు నీరు అందుబాటులో లేదు. ఈ పాటికే పులులు సైతం గ్రామాల్లో పడ్డాయి. వాటి తాకిడి తగ్గింది అనుకునేలోపే ఏకంగా నీటి కోసం ఐదు జింకలు గ్రామాల బాట పట్టాయి. దారి తప్పి దోర్నాల మణికంఠ శేఖర లాడ్జి వెనుక వైపు ఉన్న పొలాల్లో నీటి కోసం వచ్చి చిక్కుకున్నాయి. ఈ పొలం చుట్టూ కంచె వేసి ఉండడంతో జింకలు బయటికి పోలేక అందులోనే ఉండిపోయాయి. దాహార్తి ఎక్కువై ఒక జింక చనిపోయింది. రెండు జింకలు స్పృహ తప్పి పడిపోయాయి. విషయం తెలుసుకున్న దోర్నాల అటవీ శాఖాధికారి విశ్వేశ్వరరావు తన సిబ్బందితో అక్కడికి చేరుకొని పొలం చుట్టూ వేయించిన కంచెను తెంపేసి జింకలను స్వాధీనం చేసుకున్నారు. వాటికి గ్లూకోజ్ వాటర్ తాగించారు. అనంతరం అడవిలో వదిలిపెట్టారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్

ఘనంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-అద్దంకి: అద్దంకి పట్టణంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ హాజరై ముందుగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ సభ్యులు, పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటీసులిస్తామని నిర్బంధించారు

మార్టూరు పోలీస్ స్టేషన్‌లో ఘటన ● ఉన్నతాధికారులు ఆదేశాలిస్తేనే వదలిపెడతామనడం అన్యాయం: టిడిపి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

జిఒ 1ని రద్దు చేయాలని కోరుతూ చలో అసెంబ్లీకి వెళ్లొద్దని పేర్కొంటూ టిడిపి నాయకులను నోటీసులు అందిస్తామని పోలీస్ స్టేషన్‌కు పిలిపించిన మార్టూరు ఎస్ఐ కోడూరు కమలాకర్ నిర్బంధించడం దారుణమని టిడిపి బిసి సెల్ పర్చూరు నియోజకవర్గ అధ్యక్షులు శివరాత్రి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మార్టూరు టిడిపి నాయకులైన కామేపల్లి హరిబాబు, తాటి నాగేశ్వరరావును ఎస్ఐ నోటీసులు తీసుకెళ్లండంటూ స్టేషన్‌కు పిలిపించి నిర్బంధించడం అన్యాయమన్నారు. ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తేనే వదిలిపెడతామనడం దారుణమన్నారు.

మార్టూరు పోలీసు స్టేషన్ వద్దకు చేరుకున్న టిడిపి శ్రేణులు

మార్టూరులో పోలీసుల అదుపులో టిడిపి నాయకులు

చెరుకుపల్లిలో పోలీసులు జారీ చేసిన నోటీసులతో టిడిపి నాయకులు

పోలీసు స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం

జివో 1ని నిరసిస్తూ విజయవాడ వెళ్లకుండా నిర్బంధించిన టిడిపి నాయకులను విడుదల చేయాలని కోరుతూ టిడిపి శ్రేణులు మార్టూరు పోలీసు స్టేషన్ వద్దకు పెద్దఎత్తున చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తమ నాయకులను నిర్బంధం నుంచి విడుదల చేయాలని జనం కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. రాత్రి 9గంటల వరకు కూడా పోలీసులు వారిని స్టేషన్ నుంచి వదలలేదు.

చెరుకుపల్లి: జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లవద్దని ఎస్ఐ డి వెంకట కొండారెడ్డి మండల తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆదివారం నోటీసులు అందజేశారు. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరయ్యే నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెరుకుపల్లి ఎస్ఐ డి వెంకట కొండారెడ్డి నోటీసులు అందజేశారు. అసెంబ్లీ ముట్టడికి అనుమతి ఇవ్వలేదని, ఎవరూ పాల్గొనవద్దని మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన నాయకులకు మొత్తం 149 నోటీసులు అందజేశారు. తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, పట్టణ అధ్యక్షుడు నాగుల పున్నారావు, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఉప్పాల సాంబశివరావు, ఆప్కో మాజీ డైరెక్టర్ దివి రాంబాబు, మాజీ జెడ్పిటిసి సభ్యులు పిట్టు శ్రీనివాసరెడ్డి తదితరులకు నోటీసులు అందజేశారు.

రైతులను మోసం చేసిన ప్రభుత్వం: ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్న వైసిపి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేస్తోందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంటు అధ్యక్షుడు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం ఎపి రాజధాని అమరావతిలోని సచివాలయం అగ్నిమాపక కేంద్రం వద్ద టీడీపీ శాసనసభాపక్ష నేతలతో నిరసన వ్యక్తం చేశారు. ఏపీలో విద్యుత్ బాదుడు, స్మార్ట్ మీటర్ల పేరుతో రైతుల మెడకు ఉరితాళ్లు బిగిస్తున్నారంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ జగన్ సీఎం అయ్యాక రైతులకు అనేక ప్రయోజనాలు అందిస్తున్నట్లు ఆర్భాటంగా ప్రచారం చేసుకుంటున్నారే తప్ప వాస్తవానికి వైసిపి ప్రభుత్వం వల్ల రైతులకు ఒరిగిందేమీ లేదని ఏలూరి విమర్శించారు. రైతాంగాన్ని ఆదుకోవడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. సీఎం అనాలోచిత నిర్ణయాల వల్ల పవర్ సెక్టార్ కుప్పకూలిందని పేర్కొన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకే విద్యుత్ మోటార్లకు మీటర్లు బిగించే స్కీంను దుర్మార్గంగా ఈ ప్రభుత్వం అమలు చేసేందుకు కుట్రలు పన్నుతోందని అన్నారు. అన్నదాతలకు నష్టం కలిగే ఏ నిర్ణయం అయినా తెలుగుదేశం పార్టీ వ్యతిరేకిస్తుందని ఏలూరి పేర్కొన్నారు.

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, టిడిపి నాయకులు

పొలాల్లో తగ్గని వర్షపు నీరు

- ఉరక తీతకు గురై ఎండుతున్న పైరు
- అన్నదాతలకు తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

అకాల వర్షం అన్నదాతను ఆందోళనకు గురి చేస్తోంది. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షంతో మాగాణి భూముల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట నీటిలో నానుతూ దెబ్బతింటున్నాయి. వరి కోతల సమయంలో కురిసిన వర్షానికి ఓదెలు తడిసి గింజ రంగుమారి దెబ్బతినగా రబీలో సాగుచేసిన మొక్కజొన్నతోనైనా అప్పుల బారి నుంచి బయట పడవచ్చనుకున్న తమకు అకాల వర్షంతో రబీ పంట కూడా సక్రమంగా చేతికందే పరిస్థితి కనిపించడం లేదని వాపోతున్నారు. ఆదివారం కూడా తెల్లవారుజామున కురిసిన వర్షంతో నీటిపై నీరు పడటంతో ఎండిపోతున్న పంటను చూసి తట్టుకోలేని రైతు ఆయిల్ ఇంజన్‌ల ద్వారా నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమయ్యారు. కళ్లముందే వర్షపునీటితో పైరు ఎండిపోతుంటే అన్నదాత తల్లడిల్లుతున్నాడు. ఇదిలాఉండగా సాయంత్రానికి మరోమారు ఆకాశం మేఘావృతం కావటం గుండెల్లో గుబులు రేపుతోందని ఆందోళన చెందుతున్నారు. అంతేకాక డెల్టా ప్రాంతంలో అరకొరగా సాగు చేసిన మినుము, పెసర కొంత భాగం ఓదెలు దశలో ఉండగా మరికొంత పీకటానికి సిద్ధంగా ఉంది. వర్షాలకు తడిసిన ఓదెలు బూజుపట్టి గింజ కాయలోనే మొలక వస్తుందని, పీకటానికి సిద్ధంగా ఉన్న పైరు వర్షానికి తడవటంతో ఎండలు రాగానే కాయలు రాలిపోవడం లేదా పగిలిపోవటం జరుగుతోందని, దీని వల్ల అపరాలు సాగు చేసిన రైతు కూడా నష్టపోక తప్పటం లేదని ఆవేదన చెందుతున్నారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడతాయని చెబుతుండటంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం ఏ మేరకు చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

ఐలవరంలో వర్షపు నీటికి ఎండుతున్న మొక్కజొన్న, నీటిని బయటకు తోడుతున్న కౌలు రైతు

పర్చూరులో కల్లాల్లో మిర్చిని పరదాలతో కప్పిన దృశ్యం

పర్చూరు: అకాల వర్షాలతో రైతులు కష్టాల్లో మునిగి తేలుతున్నారు. ఆరుబయట పందిళ్లలో ఉన్న పొగాకును, కల్లాల్లో ఉన్న మిర్చిని కాపాడుకునేందుకు రైతులు తమ శక్తి యుక్తుల్ను ధారపోస్తున్నారు. పంట చేతికి అందే సమయంలో అనుకోని అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా కురుస్తున్న జల్లులు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వరి రైతులు కుప్పలు వేశారు. ఆరబెట్టిన మిర్చిపై కప్పిన పట్టలపైకి నీరు రావటంతో కొన్నిచోట్ల మిర్చి తడిసిపోయింది. రంగు మారి దిగుబడి తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికీ మిర్చి చేలల్లో నీళ్ల నిలవటంతో రైతులు లబోదిబోమంటున్నారు.

అరటి గుజ్జుతో బయో ప్లాస్టిక్ తయారీ

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

షేక్ నాజర్‌వలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొప్పెరపాడుకు చెందిన విద్యార్థి షేక్ నాజర్‌వలి తయారు చేసిన 'అరటి గుజ్జుతో బయో ప్లాస్టిక్ తయారీ' అను ప్రాజెక్టు బాపట్ల జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ప్రాజెక్ట్‌కు ఎంపికయ్యింది. ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థిని, గైడ్‌గా వ్యవహరించిన సైన్స్ ఉపాధ్యాయులు జి నాగేశ్వరరావు ప్రధానోపాధ్యాయులు పి. శ్రీనివాసరావు, సహచర ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ దమ్ము అంజయ్య అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైనవారికి ఈ నెల 23, 24 తేదీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం కాకినాడ ఆవరణలో రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారిని అక్కడ నుంచి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారని ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారి పి రమేష్ తెలిపారు.



నివాళి అర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పోరాటయోధులు నంబూద్రిపాద్, స్వరాజ్యం

ప్రజాశక్తి-మేదరమెట్ల

సిపిఎం పార్టీ దిగ్గజం, కేరళ మాజీ ముఖ్యమంత్రి ఈఎంఎస్ నంబూద్రిపాద్, వీరనారి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతి కార్యక్రమాన్ని మేదరమెట్ల పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం ఆంజనేయులు మాట్లాడుతూ నంబూద్రిపాద్ జీవిత చరిత్రను, మల్లు స్వరాజ్యం పోరాట పటిమ గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు బి దశరథ, కెవిపిఎస్ బాధ్యులు కంచర్ల సురేష్ బాబు, సిఐటియు బాధ్యులు వీరాంజనేయులు, కౌలు రైతు సంఘం మండల బాధ్యులు చావా కోటేశ్వరరావు, వైకుంఠం, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చేనేత నాయకులు

చేనేతలకు అన్యాయం చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు

ప్రజాశక్తి-చీరాల

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు తీరని అన్యాయం చేస్తున్నట్లు ఆలిండియా వీవర్స్ పెడరేషన్ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక నల్లగాంధీ బొమ్మ సమీపంలోని కళ్యాణ మండపంలో చేనేతల సన్నాహక సమావేశం ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో అధిక శాతం చేనేత వర్గానికి చెందిన వారున్నట్లు పేర్కొన్నారు. కానీ ఏరంగంలో కూడా వారికి సరైన ప్రాధాన్యత కల్పించకుండా ఆణచివేస్తున్నట్లు ఆరోపించారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో వారికి ప్రాధాన్యత లేదన్నారు. ఎన్నికల సమయంలో వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కనీసం ఎస్సీ, ఎస్టీల మాదిరిగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలపై పోరుబాటకు దిగుతామన్నారు. ఈ కార్యక్రమంలో వేటపాలెం జడ్‌పిటిసి బండ్ల తిరుమలదేవి, చీరాల జడ్‌పిటిసి ఆకురాతి పద్మిని, మాజీ జడ్‌పిటిసి పృథ్వీ అరుణకుమారి, నాయకులు బండారు వరప్రసాద్, గుంటి శ్రీనివాసరావు, గోలి గిరి, చంద్రమౌళి తదితర నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా నాయకుడు పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షుడు ఇట్టా నాగయ్య డిమాండ్ చేశారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి పాలేట ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పూసపాటి వెంకటరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పాదయాత్ర సమయంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమాశాల్లో ఈ విషయం గురించి చర్చించి ఇచ్చిన హామీని చేయాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇట్టా నాగయ్య మాట్లాడుతూ కార్మికుల పిఎఫ్,ఇఎస్ఐ సమస్యలు పరిష్కరించాలన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు పిఎఫ్ ద్వారా వచ్చే పెన్షను సౌకర్యం కల్పించాలన్నారు. అన్ని తరగతుల కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎ. యోహాన్, నాయకులు ఎ. కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, నరసింహారావు, శివ, గోవింద్, కోటేశ్వరరావు, రమణ, సబ్బరత్నం, పద్మ, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా షేక్అక్బర్, చలువాది శ్రీనివాసరావు

ప్రజాశక్తి-చీమకుర్తి

యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా షేక్ అక్బర్, చలువాది శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక దాచూరి రామిరెడ్డి యుటిఎఫ్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహిఒచారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బొర్రా వసంతరావు, సహధ్యక్షుడిగా గుద్దంటి వెంకటేశ్వర్లు ,మహిళా సహధ్యక్షురాలిగా అవ్వారి సుశీల, మహిళా కార్యదర్శిగా తుమ్మా శ్రీదేవి, కోశాధికారిగా పర్వతం వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్లుగా తాటికొండ మాధవి,టి. నాగమల్లేశ్వరరావు, మన్నం సుబ్బారావు, కె. శ్రీనివాసరావు ప్రసాదరావు,ఆర్. శ్రీనివాస రావు ఎన్నికయ్యారు. మండల కార్యదర్శులుగా పర్వతం భాస్కర్, ముప్పరాజు వెంకటరావు, బొడ్డు బ్రహ్మయ్య, నారాయణ, దొంతు రాము, ఆంజనేయులు, మహిళా కమిటీ కన్వీనర్గా బండి పద్మావతి, ఆడిట్ కన్వీనర్గా కోటేశ్వర రావు, పుట్టా శ్రీనివాస రావు, సాంస్కృతిక విభాగంకమిటీ కన్వీనర్గా చిరంజీవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా నల్లూరి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో హరి ప్రసాదరావు, ఎ.వీరారెడ్డి, ఎస్కె. శిలార్,చల్లా శ్రీను, పీరుసాహెబ్ పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నాయకుల నివాళి

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

తెలంగాణా సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యంకు సిపిఎం మండల కమిటీ ఘన నివాళు లర్పించింది. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్కె.మాబు మాట్లాడుతూ తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటంలో మల్లు స్వరాజ్యం తెగువ, ఆమె చూపిన ధైర్యసాహసాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, మండల కమిటీ సభ్యులు పల్లాపల్లి ఆంజనేయులు, క్రిష్టిపాటి చిన్నపురెడ్డి, టి. రామారావు, కంకణాల వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీను, ఓబులేషు, కుమ్మిత శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

రైతు దయనీయ స్థితికి దర్పణం 'మట్టిబండి'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కవితా సంపుటి రైతు దయనీయ స్థితికి దర్పణం వంటిదని, అక్షర సేద్యం చేస్తున్న కవి విత్తనాలతో సేద్యం చేసే రైతుల గురించి ఆవేదన వ్యక్తం చేస్తూ రాయడం గొప్పగా ఉందని ఎన్టిఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు తెలిపారు. ఒంగోలులోని అంబేద్కర్ భవన్లో నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో మట్టిబండి పుస్తక పరిచయ సభ ఆదివారం నిర్వహించారు. ఈసభ నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. కళామిత్రమండలి సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు సభా సంచాలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రైతులు పడుతున్న యథార్థ దశ్యాలకు నిలువుటద్దం ఈపుస్తకం అని వ్యాఖ్యానించారు. మరో ముఖ్య అతిథి నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎంతో గొప్పగా రైతు హృదయాన్ని ఆవిష్కరించారని ,రైతు పరంగా వచ్చిన పుస్తకాలలో ఈ మట్టిబండి దీర్ఘకవిత ముందు వరుసలో ఉంటుందని శ్లాఘించారు. కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు మట్టిబండిని గూర్చి విశ్లేషిస్తూ భూమి పుత్రుల కష్టాల కడగండ్లను,వారి దుర్భర జీవితాలను సమగ్రంగా మనకళ్ళ ముందు ఉంచేందుకు రచయిత తమవంతు ప్రయత్నం చాలా గొప్పగా చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 21 మంది కవులు కవిసమ్మేళనంలో పాల్గొని తమ కవితా పఠనాన్ని కొనసాగించారు. అనంతరం అతిథులను, కవులను నిర్వాహకులు సత్కరించారు.ఈ కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు , జక్కంపూడి సీతారామారావు, డాక్టర్ శింగారావు, కుర్రా ప్రసాద్ బాబు, మిడసల మల్లికార్జునరావు,డాక్టర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూనె అంకమ్మరావును సత్కరిస్తున్న దృశ్యం

22న వ్య.కా.సం సమావేశం

ప్రజాశక్తి-కొండపి

ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ప్రకాశం జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 22న కొండపిలోని సాయిబాబా స్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కెజి.మస్తాన్ తెలిపారు. ఈ సమావేశంలో గత మూడు నెలల కాలంలో వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహించిన కార్యక్రమాల గురించి సమీక్షించి భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నెరుసుల వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు

నేడు రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కాటన్ వస్త్రప్రపంచంలో ప్రత్యేకతను సంతరించుకున్న రామ్‌రాజ్ కాటన్ సంస్థ ఒంగోలు లో ఔట్ లెట్ ను అందుబాటులోకి తెచ్చింది.కర్నూలు రోడ్డు పవర్ ఆఫీసు ఎదురుగా నెలకొల్పిన షోరూం ను సోమవారం ప్రారంభిస్తున్నట్లు సంస్థ ఏరియా మేనేజర్ ఎ. భరత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అధ్యక్షుడు తడవర్తి వాసు షోరూమ్‌ను ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వస్త్రవ్యాపారుల సంఘ కార్యదర్శి బివి.సుబ్బారావు, చార్టెడ్ అకౌంటెంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బైసాని జగన్ మోహన్ రావు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

పట్టభద్రుల తీర్పుతో కనువిప్పు కలగాలి

ఎపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్

ఒంగోలు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికలలో పట్టభద్రుల తీర్పుతో ముఖ్యమంత్రికి కనువిప్పు కలగాలని ఎపి కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్ పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే ప్రభుత్వం పట్ల విద్యావంతులు, యువతలో ఉన్న వ్యతిరేకం స్పష్టంగా కనబడుతుందన్నారు. రాష్ట్రంలో విద్యావంతులు, ఉద్యోగులు, యువకులు జగన్ ప్రభుత్వంపై భరోసా కోల్పోయారన్నారు. అందుకు కారణం ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ ఇవ్వకపోవడం, ఖాళీ పోస్టుల నియామకాలల్లో నిర్లక్ష్యం వహించడం, గ్రూప్-2, గ్రూప్ 4, ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకపోవడం కారణమన్నారు. ఇప్పుడైనా ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతం ఇచ్చేటట్లు చూడాలన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ స్నేహలత

గ్రామస్తులతో సమావేశం

శింగరాయకొండ : శింగరాయకొండ మండలం పాకల గ్రామం చెల్లెమ్మ పాలెంలో భీం ధీక్ష కార్యక్రమంలో భాగంగా స్వేరో సర్కిల్ వారి ఆధ్వర్యంలో గ్రామస్తులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్వేరో సర్కిల్ రాష్ట్ర కో కన్వీనర్ డాక్టర్ స్నేహలత మాట్లాడుతూ అక్షరం - ఆరోగ్యం-ఆర్థికం గురించి గ్రామ ప్రజలకు వివరించారు. బిఆర్. అంబేద్కర్ ఆశయాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ స్థాపించిన స్వేరో సర్కిల్స్‌ను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, పిల్లలు ఉత్సాహంతో మద్దతు తెలిపారు. త్వరగా తమ గ్రామంలో స్వేరో సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్వేరో సర్కిల్ జనరల్ సెక్రటరీ పొనుగోటి ప్రభాకర్, మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ పి.జ్యోతి, జిల్లా పాధ్యక్షురాలు ఎలిజబెత్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో నైరాశ్యం..!

ప్రజాశక్తి-మార్కాపురం

ఎమెల్సీ ఎన్నికల్లో ఎందుకు పోటీ చేశామా అనే చర్చ మార్కాపురం నియోజకవర్గ వైసిపిలో నడుస్తోంది. పట్టభద్ర స్థానాల్లో వైసిపి పట్ల వ్యతిరేకత ఉందన్న విషయం ప్రస్తుత ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు తేటతెల్లం చేశాయి. ఇటీవల అధికార వైసిపి ప్రజా ప్రతినిధులు తమను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదనే వాదనలు లేకపోలేదు. ఏడాదిలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఉండగా... ప్రస్తుత పట్టభద్ర స్థానాల ఫలితాల ప్రభావం ఎలా ఉంటుందనే భయం వైసిపిలో వణుకు పుట్టిస్తోంది. వైసిపి పాలనలో నిరుద్యోగులు, కాంట్రాక్టర్లు, ఉద్యోగులు, కార్మికులు, రైతన్నలు, కూలీలు, వ్యాపార వర్గాలు సైతం అసంతృప్తితో ఉన్నారనేది నిజం.! వీటన్నింటితో పాటు అధికార వైసిపిలో ఎవరి గ్రూపు వారిదే అన్నట్లుగా పెంచి పోషించుకోవడం మరింత నష్టాన్ని కలిగిస్తోంది.

మార్కాపురం నియోజకవర్గం ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి, ప్రస్తుతం వైసిపికి కంచుకోటగా ఉంది. ప్రస్తుతం ఆ పార్టీలో గ్రూపులు ఏర్పడ్డాయి. ఆ పార్టీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డికి వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డి సమీప బంధువే. అయినప్పటికీ వారి మధ్య సఖ్యత లేదనే వాదనలు ఉన్నాయి. పార్టీ వ్యవస్థాపక రోజు నుంచీ పని చేసిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి, ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి మధ్య మరింత దూరం పెరిగింది. ఇటీవలే మార్కాపురం జిల్లా ఉద్యమంతో నియోజకవర్గ ప్రజలకు పరిచయమైన వైసిపి రాష్ట్ర నాయకులు పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి కూడా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో దూరం కొనసాగిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి తరపున పైన పేర్కొన్న వారంతా పోటీ చేయాలనే ఆలోచనలో ఉనారు. ఆ దిశగా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. సిట్టింగ్ ఎమెల్యే నాగార్జునరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే మిగిలిన వారు పనిచేస్తారా లేదా అనే చర్చ నడుస్తోంది. జంకెతో పాటు వెన్నా, పెద్దిరెడ్డి మాత్రం ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి కాకుండా ముగ్గురిలో ఎవరికి టిక్కెట్ ఇచ్చినా కలిసి పనిచేసుకుందామన్న ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. అక్కడక్కడా జరుగుతున్న కార్యాక్రమాల్లో జంకె వెంకటరెడ్డి, వెన్నా హనుమారెడ్డి, పెద్దిరెడ్డి సూర్యప్రకాష్‌రెడ్డి కలిసి చర్చించుకోవడం జరుగుతోంది. అనుకోకుండా కొన్ని సందర్భాల్లో ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి తారసపడినా పై ముగ్గురూ తప్పించుకునే విధంగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నేతలే అంటున్నారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి కూడా అందరినీ కలుపుకుపోవడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆశించిన మేర ఓట్లు పొందలేకపోవడానికి కారణం ఐక్యంగా పనిచేయకపోవడం ఓ కారణమని ఆ పార్టీ నేతలు కొందరు బహిరంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు... అధికార పార్టీ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతోందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఎమెల్సీ పట్టభద్ర ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు రాష్ట్రంలోనే కాదు... మార్కాపురం నియోజకవర్గంలోనూ వైసిపి క్యాడర్‌లో నైరాశ్యం నింపింది. మార్కాపురం నియోజకవర్గంలో గ్రూపులు ఒక్కటి కాకపోతే వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఫలితం మరింత దారుణంగా ఉంటుందని ఆ పార్టీ వీరాభిమానులు కొందరు ఆందోళన చెందుతున్నారు.

చలో విజయవాడకు వెళ్లవద్దని..

ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి-కొండపి

నోటీసు అందుకుంటున్న మస్తాన్

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం తలపెట్టిన చలో విజయవాడను అడ్డుకోవడం దారుణమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కెజి.మస్తాన్ తెలిపారు. చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనరాదని కోరుతూ కెజి.మస్తాన్‌కు పోలీసులు ఆదివారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడటమే నేరమా అనిప్రశ్నించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీలపై అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులు అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. **పొదిలి :** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో విజయవాడ వెళ్ళకూడదని అంగన్‌వాడీలకు ముందస్తు నోటీసులు ఇవ్వడాన్ని తాము ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.శోభారాణి, అంగన్‌వాడీలు నీరజ, జి.భాగ్యలక్ష్మి, జి.కోటేశ్వరిని పోలీసు స్టేషన్‌కు పిలిపించి నోటీసులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. నిర్బంధాలతో పోరాటాలను అణచివేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకమన్నారు. శాంతియుతంగా జరపతలపెట్టిన ధర్నాకు ఆటంకాలు కల్పించరాదన్నారు. అంగన్‌వాడీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. **పామూరు :** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టనున్న చలో విజయవాడ నేపథ్యంలో పోలీసులు నాయకులపై బైండోవర్ కేసులు పెట్టడం సరైనది కాదని సిపిఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి తెలిపారు. పోలీసులు సిపిఎం, ప్రజాసంఘాల నాయకులకు ఆదివారం ముందస్తు నోటీసులు అందజేయడం దారుణమని ఆయన ఆరోపించారు. పోలీసుల నుంచి నోటీసుల అందుకున్న వారిలో కె.మాల్యాద్రి, షేక్ ఖాశిం సాహెబ్, వెంకటేశ్వర్లు, మహాదేవయ్య, పిచ్చిరెడ్డి ఉన్నారు. **నాగులుప్పలపాడు :** అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనకూడదంటూ మండల పరిధిలోని చదలవాడ గ్రామానికి చెందిన సిఐటియు నాయకుడు ఎ. చిరంజీవికి , దాసరి ఆంజనేయులు, సిపిఎం మండల నాయకులు జె.జయంతిబాబు, టి శ్రీకాంత్ , జి. బసవపున్నయ్య, రైతుసంఘం నాయకులకు పోలీసులు మందస్తు నోటీసులు అందజేశారు

అమ్మనబ్రోలులో నోటీసులు అందజేస్తున్న పోలీసులు

అనర్హుల జాబ్‌కార్డులు రద్దు

పిసిపల్లి : ఉపాధి హామీ పథకంలో సింగిల్ జాబ్ కార్డు పొంది ప్రస్తుతం ఉపాధి పనులకు రాకుండా ఉన్న సింగిల్ జాబ్ కార్డుదారులను అర్హుల జాబితా నుంచి తొలగిస్తున్నట్లు ప్రోగ్రాం అధికారి మరియు ఎంపిడిఓ డివి.రమణారెడ్డి తెలిపారు. గతంలోఇళ్ల వద్ద ఇంకుడు గుంతల కోసం, పండ్ల తోటల కోసం, గడ్డి పెంపకం కోసం, ఇల్లు నిర్మించుకోవడం కోసం, పెరటి మొక్కల పెంపకం కోసం వివిధ అవసరాల కోసం కొంతమంది సింగిల్ జాబ్ కార్డులు పొందిఉన్నట్లు తెలిపారు. వారిలో అనర్హులను గుర్తించి సంబంధిత సింగిల్ జాబ్ కార్డ్సను ఈ నెల 31 లోపు రద్దు చేస్తున్నట్లు ఎంపిడిఓ డివి.రమణారెడ్డి తెలిపారు. ఎవరైనా కుటుంబ సభ్యులు జాబ్ కార్డులు కొత్తగా తీసుకోవాలి అనుకుంటే సంబంధిత సింగిల్ కార్డ్‌లో యాడింగ్ చేసుకోవాలన్నారు.

వేగంగా రహదారి మరమ్మతులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

రాష్ట్ర పురపాలక పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఆదేశాలతో పుల్లలచెరువు మండలం మనేపల్లి, ముటుకుల రోడ్డుకు మరమ్మతుల ప్రక్రియ వేగంగా జరుగుతోంది. గత కొన్నేళ్లుగా ఆ రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో తారంతా లేచిపోయి గుంతలు, పడి ప్రయాణానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. ఈ విషయాన్ని మంత్రి సురేష్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన మరమ్మతులు నిర్వహించి తిరిగి తారు రోడ్డు నిర్మించాలని ఆదేశించారు. అందులో భాగంగా అధికారులు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. రోడ్డుపై పడిన గుంతలు పూడ్పించి మరమ్మతులు చేయించారు. తిరిగి తారు పోసి కొత్త రోడ్డులా సిద్ధం చేశారు.

వేగంగా జరుగుతున్న మనేపల్లి, ముటుకుల రహదారి పనులు

పేద విద్యార్థులకు విద్యాదీవెన వరం

యర్రగొండపాలెం : జగనన్న విద్యా దీవెన పథకం పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు వరం లాంటిదని ఎటిడబ్ల్యుఒ డి. అమర సుబ్బయ్య తెలిపారు. జగనన్న విద్యా దీవెన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమర సుబ్బయ్య మాట్లాడుతూ అర్హులైన విద్యార్థు లందరికీ ఉన్నత విద్య చదివే అవకాశం జగనన్న విద్యా దీవెనతో నెరవేరుతుందన్నారు. పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదవాలనే లక్ష్యంతో జగనన్న విద్యా దీవెన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో 4,979 మంది తల్లుల ఖాతాల్లోకి రూ. 3,70, 93, 891 జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యుఒలు లక్ష్మయ్య, శ్రీనివాసరావు, ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల రాకపోకలకు అనుమతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు ముగిసే వరకు దోర్నాల, శ్రీశైలం ఘాట్లో రాత్రి వేళల్లోనూ వాహనాల రాకపోకలకు అనుమతి ఇస్తున్నట్లు దోర్నాల ఫారెస్ట్ రేంజర్ విశ్వేశ్వరరావు ఆదివారం తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు ఈ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం ఉందన్నారు. అయితే ప్రస్తుతం ఉగాది ఉత్సవాలకు వెళ్లే భక్తులకు ఇబ్బంది లేకుండా ఈ వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మాట్లాడుతున్న రేంజర్

అందుబాటులో రెండు భారీ క్రేన్లు..

ఉగాది బ్రహ్మోత్సవాల సందర్భంగా దోర్నాల నుంచి శ్రీశైలం వాహనాల్లో వెళ్లే భక్తులకు నల్లమల్ల ఘాట్ రోడ్డులో ప్రమాదాలు సంభవించినప్పుడు భక్తులకు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రెండు భారీ క్రేన్లు అందుబాటులో ఉంచినట్లు ఫారెస్ట్ రేంజర్ విశ్వేశ్వరరావు తెలిపారు.

వాటర్‌ప్లాంట్ మూత

ప్రజాశక్తి-పొన్నలూరు

మండల పరిధిలోని కె.అగ్రహారం గ్రామంలో మరమ్మతుల కారణంగా గత మూడు నెలలుగా వాటర్‌ప్లాంట్ మూతపడింది. దాని గురించి అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో తాగునీటి కోసం అవస్థలకు గురవుతున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. బయట 20 లీటర్ల నీటిని కొనుగోలు చేయాలంటే రూ.20 కొనుగోలు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్‌కు మర్మమతులు చేయించి నీటి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు టిడిపి కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-తర్లుపాడు

టిడిపి మార్కాపురం నియోజక వర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నివాస గృహంలో టిడిపి కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, బూత్ కమిటీ కన్వీనర్స్, యూనిట్ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, తెలుగు యువత, అనుబంధ కమిటీ సభ్యులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వినికిడి యంత్రం అందజేత

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని ఎం. నిడమలూరు గ్రామానికి చెందిన తిరుమలశెట్టి వరమ్మ గత కొంతకాలంగా వినికిడి సమస్యతో బాధపడుతోంది. గ్రామానికి చెందిన వైసిపి నాయకులు వాకా బాలకష్ణారెడ్డి వరమ్మ వినికిడి సమస్యతో బాధపడుతున్న విషయం గురించి వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబుకు వివరించారు. అశోక్‌బాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ సామాజిక సేవకులు మన్నం వెంకయ్య వినికిడి యంత్రాన్ని తెప్పించి వరమ్మ కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వరికూటి అశోక్ బాబు, మన్నం వెంకయ్య, వాకా బాలకష్ణారెడ్డికి వరమ్మ కుటుంబ సభ్యులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి కె. సుబ్బారావు, గ్రామస్తులు పాల్గొన్నారు

అసంపూర్తిగా నాడు-నేడు పాఠశాలల నిర్మాణం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలో నాడు, నేడు రెండో విడత కింద ఎంపికైన పాఠశాలలకు నిధులు రానందున నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోయాయని పాఠశాలల విద్యా కమిటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. నాడు నేడు రెండో విడత కింద ఎంపికైన పాఠశాలలు 26 ఉన్నాయి. అందులో హైస్కూల్స్-3, అంగన్‌వాడీ బిల్డింగులు-3, యూపీ పాఠశాల-1, ప్రాథమిక పాఠశాలలు-19 ఉన్నాయి. ఈ ఎంపికైన పాఠశాలలకు 15 శాతం నిధులను విడుదల చేశారు. ఈ నిధులను పాఠశాల నిర్వహణ కమిటీల ద్వారా, వివిధ స్థాయిలలో పాఠశాలల నూతన తరగతి గదుల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, వంట గదులు, ప్రహరీ గోడల నిర్మాణాలు, పాఠశాల మరమ్మతులను చేశారు. మిగిలిన పనులను పూర్తి చేయడం కోసం ప్రభుత్వం నుంచి రావలసిన నిధులు ఇంకా మంజూరు కాలేదని పేర్కొన్నారు. దీంతో భవన నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిఉన్నాయి.

నిర్మాణంలో జాప్యం జరగడం వల్ల పాఠశాలలోని విద్యార్థులకు అసౌకర్యం కలుగుతోందని విద్యా కమిటీలు తెలుపుతున్నాయి. ఒక్కొక్క పాఠశాలకు పది పనుల కోసం రూ.10 లక్షలు, భవన నిర్మాణాల కోసం రూ.11 లక్షలు అవసరం కాగా, ప్రభుత్వం మొదటి విడతగా 15 శాతం నిధులే విడుదల చేయడంతో పాఠశాల నిర్వహణ కమిటీ వారు ఆ నిధులతోనే అయినకాడికి పనులు కానిచ్చేశారు. మిగిలిన నిధులు విడుదల చేస్తే అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులు పూర్తి చేసి, రాబోయే విద్యా సంవత్సరం కల్లా నిర్మాణాలు పూర్తి చేస్తామని వారు చెబుతున్నారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో మొదలుపెట్టిన భవన నిర్మాణాలు నాలుగు నెలల్లో అంటే జనవరి కల్లా పూర్తి కావాల్సి ఉంది. కానీ ఆరు నెలలు దాటినా, నిధుల జాప్యంతో ఆగిపోయాయని చెబుతున్నారు. జూన్ నెల నుంచి పాఠశాలలు ప్రారంభం అవుతాయని, విద్యార్థులకు అసౌకర్యం కలవకుండా ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులను మంజూరు చేయాలని ఆయా పాఠశాలల విద్యా కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి.

నిధులు లేక అర్ధాంతరంగా నిలిచిపోయిన నాడు నేడు భవనాలు

జిల్లాకు కీర్తి కిరీటం 'అద్దంకి పద్యశాసనం'

ప్రజాశక్తి-బాపట్ల

పిసి సాయిబాబు

బాపట్ల జిల్లా కీర్తికి మణిమకుటంగా వెలుగొందుతున్న అద్దంకి పద్య శాసనాన్ని తిరిగి రాష్ట్రానికి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేయడం హర్షణీయమని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు అన్నారు. ఆదివారం సాయిబాబు విలేకరులతో మాట్లాడారు. అద్దంకి పద్య శాసనాన్ని తిరిగి రాష్ట్రానికి చేర్చేందుకు తమిళనాడు ప్రభుత్వానికి లేఖ రాయడం శుభపరిణామమన్నారు. తెలుగు సాహిత్యంలో మొట్టమొదటి పద్యశాసనం. 12 శతాబ్దాలకు పూర్వమే బాపట్ల జిల్లాలోని అద్దంకిలో ఈ శాసనం వెలుగు చూసింది. తెలుగు సాహిత్యంలో తొలి కిరణాలు బాపట్ల జిల్లా నుంచే ప్రసరించాయనడంలో సందేహం లేదన్నారు. తెలుగు సాహిత్యం బాపట్ల జిల్లాలోనే ఓనమాలు దిద్దుకుంది. సంస్కృత భాషా పెత్తనాన్ని ధిక్కరించి, తెలుగు పద్యాలను శాసనాలకెక్కించిన కవులు ఆనాడు ఈ జిల్లాలో ఉండడం మనకు గర్వకారణం. తెలుగు పద్య మహా సౌధానికి పునాదిరాళ్లు మోసిన మహా కవులు బాపట్ల జిల్లా వారు కావడం విశేషం. తూర్పు చాళుక్య మహారాజు మూడో గుణగ విజయాదిత్యుడి కాలం నాటి ఈ శాసనం. ఆయన సేనాధిపతి పండరంగడు క్రీస్తుశకం 848లో దీనిని వేయించారు. అద్దంకి పొలాల్లో ఇది లభ్యమయింది. 1922లో దీనిని చెన్నై ఎగ్మోర్ ప్రభుత్వ మ్యూజియంకు తరలించారు. ప్రస్తుతం అది అక్కడే ఉంది. వందేళ్ల తర్వాత రాష్ట్రానికి తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు జరగడం ఆహ్వానించదగ్గ పరిణామమని సాయిబాబా అన్నారు.

ఉగాది వేడుకలలో సన్మాన గ్రహీతలు

తెలుగు సంస్కృతికి ప్రతీక ఉగాది

ప్రజాశక్తి-చీరాల

తెలుగునాట ఉగాది పండుగ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అని గీర్వాణాంధ్ర సరస్వతి బిరుదాంకితులు, ఆజోవిభో కందాళం సంస్థ వ్యవస్థాపకులు అప్పాజోస్యుల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం బత్తుల సర్వీసు ట్రస్టు చీరాల వారి ఆధ్వర్యంలో స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో శోభకృత్ ఉగాది స్వాగత వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలలో అంకిత భావనలతో సామాజిక సేవచేస్తున్న ప్రతిభావంతులకు ఉగాది పురస్కార సత్కారాలు అం దించారు. ఈ క్రమంలో ట్రస్ట్ అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పాజోస్యుల ఉగాది పండుగకు సంబంధించి ప్రత్యేకతలను వివరించారు. అలాగే విశిష్ఠ అతిథులుగా విచ్చేసిన డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, డాక్టర్ కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, రొటేరియన్ వలివేటి మురళీకృష్ణ, వడలి రాధాకృష్ణ, గాదె హరిహరరావు ఉపన్యసించారు. చివరిగా ధర్మవరపు వెంకటరమణ, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, దామర్ల బాపయ్య, భాగి కృష్ణమూర్తి, వడలి రాధాకృష్ణ, అల్లూరి శివకోటేశ్వరరావు, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాదీవెన పథకాన్ని వినియోగించుకోవాలి

సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ్ దిబోరా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో జగనన్న విద్యాదీవెన పథకాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జె.రాజ్ దిబోరా పిలుపునిచ్చారు. ఆదివారం బాపట్ల కలెక్టరేట్‌లో జగనన్న విద్యాదీవెన కార్యక్రమం కింద విద్యార్థుల తల్లులకు మెగా చెక్కును జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజ్ దిబోరా మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులు కూడా ఉన్నత చదువులు చదువుకోవాలని ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పేద విద్యార్థులు కాలేజీలకు చెల్లించవలసిన పూర్తి ఫీజు మొత్తాన్ని క్రమం తప్పకుండా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మంది పిల్లలకు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. బాపట్ల జిల్లాలో ఎస్.సి, ఎస్.టి., బి.సి, ముస్లిం, క్రిస్టియన్‌లకు సంబంధించిన 31 వేల 46 మందికి రూ.26.25 కోట్లను వారి తల్లుల ఖాతాలకు జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి దస్తగిరి, జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరాలకు

స్వచ్ఛంద సంస్థల సహకారం అవసరం

ప్రజాశక్తి-బాపట్ల

గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని బాపట్ల కమ్మ జన సేవా సమితి అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కమ్మ జనసేవా సమితి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల కమ్మ కళ్యాణ మండపంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కమ్మ జన సేవా సమితి పనిచేస్తుందని అన్నారు. కంటి వైద్య శిబిరాల పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి బాపట్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. శిబిరంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్యులు దృశ్య, మేఘన కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి పెదకాకాని శంకర నేత్రాలయంలో కంటి శుక్లాలకు శస్త్ర చికిత్సలు చేస్తారని క్యాంప్ ఇన్‌ఛార్జి నాగబాబు తెలిపారు. మొత్తం 3వందల మందికి శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కమ్మ జన సేవా సమితి కార్యదర్శి రామినేని వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి కొల్లా శ్రీనివాసరావు, కోశాధికారి ఏలూరి హరిబాబు, మానం భద్రయ్య, కారుమంచి వీరయ్య పాల్గొన్నారు.

21న చిన్న మల్లవరంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారి సౌజన్యంతో ఈ నెల 21వ తేదీ మంగళవారం, మండలంలోని చిన్న మల్లవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో, ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్య శిబిరం సమన్వయకర్త తాళ్లూరు రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్ళు, నరములు, కంటిచూపు, గుండె, గ్యాస్ ట్రబుల్, సాధారణ వ్యాధులకు ఉచితంగా చూస్తారని చెప్పారు. షుగరు, బిపి, ఈసీజీ పరీక్షలు ఉచితంగా చేసి, మందులు కూడా ఉచితంగా ఇస్తారని రామాంజనేయులు తెలిపారు. ఈ క్యాంపులో చూపించిన వారికి కిమ్స్ హాస్పిటల్‌లో నెల రోజులు ఉచితంగా ఓపి చూస్తారని, నిర్ణీత పరీక్షలపై 50 శాతం రాయితీ ఇస్తారని రామాంజనేయులు తెలిపారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డు, తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి, ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కిమ్స్ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తామని పేర్కొన్నారు.

ఏల్చూరులో పేరుకుపోయిన మురుగు నీరు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు గ్రామంలో కొండమీద వెంచేసి ఉన్న లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వెళ్లే వీధి దారిలో మురుగునీరు నిల్వ ఉండడంతో, దేవస్థానం వైపు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాళ్ల లోతు మురుగు నీటిలో నడవాల్సి వస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అటుగా పోయే మహిళలు, వృద్ధులు, పిల్లలు జారిపడి గాయాలపాలైన వారు కూడా ఉన్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. వీధిలో పేరుకుపోయిన మురుగు నీటిని తొలగించాలని పంచాయతీ అధికారులకు తెలియజేసినా, పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో పంట పొలాలకు వెళ్లే నీరు కూడా లీకులై ఇదే వీధికి వస్తున్నాయని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దేవస్థానానికి వెళ్లే వీధిలో పేరుకుపోయిన మురుగు నీటిని తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంబిబీఎస్ పట్టా సాధించిన

కంభం విద్యార్థిని నాజియా సుల్తానా

ప్రజాశక్తి-కంభం

కంభం పట్టణానికి చెందిన నాజియా సుల్తానా విజయవాడ లోని నిమ్రా కళాశాలలో ఎంబీబీ ఎస్ పూర్తిచేసి శుక్రవారం ఆ కళాశాలలో నిర్వహించిన కాన్వకేషన్ లో ఎంబీబీఎస్ పట్టా పొందారు. కంభంలోని నాయక్ వీధికి చెందిన షేక్ బాషాలాల్ కూతురైన నాజియా సుల్తానా పదో తరగతి వరకు కంభంలోని వాసవి విద్యానికేతన్‌లో చదువుకుంది. టెన్త్ క్లాస్‌లో ఆమె పదికి పది పాయింట్లు సాధించింది. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో శ్రీచైతన్య కళాశాలలో చదివి 440 మార్కులకు గాను 433 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంకు పొందింది. ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు కైవసం చేసుకుంది. 2015లో నిర్వహించిన నీట్ పరీక్షలలో జాతీయ స్థాయిలో 86 వేల ర్యాంకు సాధించింది. అనంతరం విజయవాడలోని నిమ్రా కళాశాలలో ఎంబీబీఎస్ చదివారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీ తర్వాత కార్డియాలజిస్టుగా పేదలకు సైతం తక్కువ ఖర్చుతో సేవలందించడం లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా కంభం పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి యథావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియడం వల్ల కోడ్ ఎత్తివేయటంతో జిల్లాలో 'డయల్ యువర్ కలెక్టర్', స్పందన కార్యక్రమాలను తిరిగి చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి.చిన ఓబులేసు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి ఈ కార్యక్రమాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, 11 గంటల నుంచి స్పందన కార్యక్రమం చేపడతామని వివరించారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

మల్లు స్వరాజ్యం ఆశయాలు సాధిద్దాం

ఐద్వా జిల్లా సీనియర్ నేత వై.అంజనీదేవి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

అసమాన పోరాట యోధురాలు, మహిళా ఉద్యమ నిర్మాత మల్లు స్వరాజ్యం ఆశయాల సాధన కోసం అంకితమవుదామని ఐద్వా సీనియర్ నాయకురాలు వై.అంజనీదేవి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్‌బిజి భవన్‌లో తెలంగాణ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఐద్వా జిల్లా అధ్యక్షులు సయ్యద్ షమ్మి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంజనీదేవి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమానికి ముందే తెలంగాణ ప్రాంతంలో భూమి, భుక్తి కోసం, కష్టజీవుల విముక్తి కోసం, మహిళా సమానత్వం కోసం జరిగిన సమరశీల పోరాటాల్లో మల్లు స్వరాజ్యం ప్రముఖ పాత్ర పోషించారన్నారు.. తన కుటుంబం నుండి జాతీయ ఉద్యమ భావజాలాన్ని అందిపుచ్చుకున్నారని, నైజాం పరిపాలనలో రజాకార్ల దుర్మార్గమైన హింసకు వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో జరిగిన ఉద్యమాల్లో స్వరాజ్యం పాల్గొన్నారన్నారు. ఒకవైపు తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయుధాలతో పోరాటం సాగిస్తూనే మరోవైపు మహిళా ఉద్యమాన్ని నిర్మించడంలో ఆమె క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం నిర్మాణంలో ఆమె గొప్ప పాత్ర పోషించారని, ఆమె ఆశయాల సాధన కోసం అంకితమవుదామని పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ పెద్ద భూస్వామ్య కుటుంబంలో పుట్టి అట్టడుగునున్న కష్టజీవులు, అవమానాలకు, అన్యాయాలకు గురవుతున్న మహిళల హక్కుల కోసం పోరాడిన యోధురాలు స్వరాజ్యం అని తెలిపారు. మహిళలు ఇంటి నుంచి బయటకు రాలేని రోజుల్లోనే ఆయుధాలు వినియోగించడం, గుర్రంపై స్వారీ చేస్తూ నైజాం సైనికులపై సమరం సాగించారన్నారు. మహిళలకు సమాన వేతనాలు దక్కాలని, దాడులు, అత్యాచారాలు, వరకట్న దురాచారం వంటివి అంతం అవ్వాలని ఆమె నిరంతరం శ్రమించారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగిన సారా వ్యతిరేక పోరాటంలోనూ స్వరాజ్యం వీరోచితంగా పోరాడారని తెలిపారు. ఆమె సాగించిన పోరాటాలను మననం చేసుకొని మహిళా సమానత్వం కోసం స్వరాజ్యం ఆశించిన ఆశయాల సాధన కోసం ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు యస్. కె.నాగూర్ బి, యన్ మాలతి, జి. ఆదిలక్ష్మి, బి గోవిందమ్మ, ఏ సీతామహాలక్ష్మి, జి. భానుమతి, బి రాజ్యలక్ష్మి, కె.విజయమ్మ పాల్గొన్నారు.

తప్పుడు కేసులు ఉపసంహరించుకోవాలి

యుఇఇయు డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉత్తరప్రదేశ్ విద్యుత్ ఉద్యోగులపై ప్రభుత్వ దమన కాండను ఖండించాలని, వారిపై పెట్టిన తప్పుడు కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జివి.రాగయ్య డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లు గత 16వ తేదీ నుండి 18వ తేదీ వరకు రాష్ట్ర వ్యాపిత సమ్మె చేశారన్నారు. గత సంవత్సరం డిసెంబర్ 3వ తేదీన ఉద్యోగులతో కుదిరిన ఒప్పందాలకు భిన్నంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని, జనరేటింగ్ స్టేషన్‌లను ప్రవేట్ వ్యక్తులకి అప్పగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తూ మూడు రోజులు పాటు విజయవంతంగా, శాంతియుతంగా సమ్మె చేశారన్నారు. ఇది జీర్ణించుకోలేని అక్కడి బిజెపి రాష్ట్ర సర్కార్ అత్యవసర రంగం పేరుతో ఉద్యోగ నాయకులపై తప్పుడు కేసులు పెట్టించి, అరెస్టులకు పూనుకుందన్నారు. ఇటువంటి తప్పుడు చర్యలు ఉద్యమాలను ఆపలేవని చరిత్ర తెలియజేస్తోందన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో ఏర్పాటైన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేట్ వ్యక్తులకి అప్పచెప్పే కేంద్రప్రభుత్వం ఆ విధానాలను విరమించుకోవాలన్నారు. అదే దారిలో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రవేటీకరణ విధానాలు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని, లేకపోతే విద్యుత్ ఉద్యోగుల దేశవ్యాపిత సమ్మెకి సిద్ధమవుతారని తెలియజేశారు.

ఫొటోగ్రఫీలో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని రూడ్‌సెట్ సంస్థలో ప్రకాశం జిల్లా గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో ఏప్రిల్ 10 నుంచి మే 9 వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రూడ్‌సెట్ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణతో పాటు భోజనం, వసతి ఉచితంగా కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9573363141 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఉన్నత విద్యావంతులుగా ఎదిగేలా కృషి

- సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మా నాయక్ - విద్యాదీవెన చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



చెక్కు అందజేస్తున్న జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి లక్ష్మానాయక్

బడుగు, బలహీనవర్గాల పిల్లలు కూడా ఉన్నత విద్యావంతులుగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటోందని జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి లక్ష్మానాయక్ అన్నారు. జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా 2022-23 విద్యా సంవత్సరానికి తొలి విడత ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను అర్హులైన విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదివారం ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ప్రారంభించారు. ఇందుకు అనుబంధంగా జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మా నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 50,174 మంది విద్యార్థులకు చెందిన రూ.37,46,28,125ను 45,241 మంది తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. వీరిలో ఎస్సీ విద్యార్థులు 12913 మంది, ఎస్టీలు 1185, బీసీలు 16574, ఈబీసీలు 13276, ముస్లిం మైనారిటీలు 3186, కాపులు 2984, క్రైస్తవ మైనారిటీలు 56 మంది ఉన్నట్లు తెలిపారు. ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఈ ఆర్థిక సహాయం చేసినట్లు ఆయన తెలిపారు. అర్హులైన విద్యార్థులకు బ్యాంకు చెక్కును ఈ సందర్భంగా ఆయన అందించారు. కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి అంజల, వికలాంగుల సంక్షేమ అధికారి, ఇన్‌ఛార్జి మైనారిటీ సంక్షేమ అధికారి అర్చన, ఇతర సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు

- యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు
- ఓట్లు వేసిన వారికి అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తూ, కించ పరిచేలా మాట్లాడుతూ పర్యవేక్షణ చేస్తున్న విద్యాశాఖ అధికారుల వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు యన్.వెంకటేశ్వర్లు తెలిపారు. యుటిఎఫ్ ప్రకాశం జిల్లా 48వ కౌన్సిల్ సమావేశాలు స్థానిక వేమూరి కళ్యాణ మండపంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ.వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సకాలంలో పుస్తకాలు, బూట్లు, జెవికె కిట్స్, వర్క్ పుస్తకాలు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోకుండా, అవి సరిగా లేవనే పేరుతో ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొని వస్తే విద్యార్థులకు ఎలా నాణ్యమైన విద్య వస్తుందో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛ వాతావరణంలో విద్య చెప్పాల్సిన ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవటం తగదన్నారు. బోధన సమయంలో యాప్‌ల పేర్లతో, ట్రైనింగ్ పేరుతో హరిస్తున్న అధికారులపై చర్య తీసుకోకుండా, బోధనేతర కార్యక్రమాలు సరిగా చేయటం లేదని ఉపాధ్యాయులపై సస్పెన్షన్లు, షోకాజ్‌లు ఇవ్వటం సరి కాదన్నారు. ఇప్పటికైనా బోధనేతర కార్యక్రమాల్ని మొత్తం రద్దు చేయాలని, ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో యాప్స్ బహిష్కరణకు పిలుపునివ్వడానికి కూడా వెనకాడమని తెలిపారు రకరకాల డిపార్ట్మెంట్లు పాఠశాలకు వస్తూ వారు చేయాల్సిన పనులు కూడా ఉపాధ్యాయులతో చేయిస్తూ, వాటిని చేయకపోతే డిఫాల్ట్‌గా చూపడం సరికాదని, ఉపాధ్యాయుడు బోధన కోసమా లేదా బోధనేతర కార్యక్రమాల కోసమా ప్రభుత్వం, అధికారులు చెప్పాలని ప్రశ్నించారు. విద్యారంగంలో జరుగుతున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఓట్లు వేయటాన్ని యుటిఎఫ్ స్వాగతిస్తుందని, ప్రభుత్వం ఉపాధ్యాయులందరికి అభినందనలు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన విధానాలను మార్చుకోవాలని, లేకుంటే భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని తెలిపారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉద్యమంలో భాగమని, గెలుపు ఓటములు ఉద్యమాన్ని ఎలాంటి ప్రభావితం చేయవని తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉద్యమాలు చేయడానికి ఉపాధ్యాయులు సంసిద్ధత కావాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను పరిరక్షించుకోవడం కోసం ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో కలిసి ఒక ఉద్యమాన్ని నిర్మించాలని కోరారు. మున్సిపల్, ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని తెలిపారు. సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ పోరాటానికి పిలుపునిస్తుందని దీనిలో అందరూ కలిసి రావాలని కోరారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రవి, ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, యుటిఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాంగోపాల్ వర్మపై కేసు నమోదు చేయాలి

- యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలి - ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

మహిళలు, విద్యార్థినులను అవమాన పరుస్తూ అమానుషంగా మాట్లాడిన సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. రాంగోపాల్‌వర్మ మహిళలను కించపరుస్తూ మాట్లాడిన తీరును నిరసిస్తూ స్థానిక ఎల్‌బిజి భవన్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాంగోపాల్ వర్మ ఫోటోను మహిళలు చెప్పుతో కొడుతూ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఒక అత్యున్నతమైన విద్యా సంస్థలో విద్యార్థులకు సరైన మార్గదర్శకత్వం ఇవ్వాల్సిన మేధావులను, విద్యావేత్తలను ఆహ్వానించాల్సింది పోయి ఉన్మాదులను, సమాజం పట్ల బాధ్యత లేని సంఘ విద్రోహశక్తులాంటి వారిని అతిథులుగా ఆహ్వానించటం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ఉన్మాదుల ద్వారా భావి భారత పౌరులకు ఏమి నేర్పించాలనుకుంటున్నారో పాలకులు చెప్పాలని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యాలయాలు ఈ స్థాయికి చేరటం విచారకరమన్నారు. తక్షణమే రామ్‌గోపాల్ వర్మను అరెస్టు చేయాలని, అతన్ని అతిథిగా ఆహ్వానించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు నెరుసుల మాలతి మాట్లాడుతూ మహిళల పట్ల ఇంత నీచంగా ఒక ఉన్నత విద్యాసంస్థలో అతిథిగా వెళ్ళిన వ్యక్తి మాట్లాడితే ఇంతవరకు ఎటువంటి చర్యలు ప్రభుత్వం తీసుకోకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఉన్న మహిళా కమిషన్ సుమోటోగా రాంగోపాల్ వర్మపై కేసు నమోదు చేయాలని, మరొకరు ఇటువంటి వ్యాఖ్యలు చేయకుండా అతనికి బుద్ధి చెప్పాలని అన్నారు. నిరసన కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు సయ్యద్ షమ్మీ, జిల్లా నాయకురాళ్లు గంగవరపు ఆదిలక్ష్మి, ఎస్.కె నాగూర్ బి, ఆళ్ల సీతామహాలక్ష్మి, బత్తుల గోవిందమ్మ, వై అంజనీ దేవి, జి.భానుమతి, కే విజయమ్మ పాల్గొన్నారు.